


# రంగు వెలిసిన బొమ్మ

శీలా సుభద్రాదేవి

'బెస్ట్ విషెస్ సువర్చలా'

అక్కడే పెళ్ళికూతురు ప్రక్కనే కూర్చొని పూలమాల కడుతూ పరిచయం ఉన్న కంఠం వినిపించేసరికి తలెత్తాను.

ఒకామె తలుపు దగ్గర నిలబడి ఉంది.

వెనకనుండి వెలుగు కిరణాలు ఆమె పై పడటం వలన, వెలిగించిన బ్యాటరీ లైటు అద్దంమీద చేతివేళ్ళని పెడితే వచ్చిన లేత నీరుకాయరంగులో ఆమె ఉంది. చప్పున గుర్తు వచ్చింది.

"మీరు వాసవి కదూ!" అన్నాను.

"ఊఁ ... మీరు ... రజనీ కదూ... అంది గుర్తు తెచ్చుకున్నట్లుగా.

మామయ్య కూతురు సువర్చల అందుకుంది "వాసవిగారు మా కాలేజీలోనే లెక్చరరుగా పనిచేస్తున్నారు. వదినా! నాకు ఎకనమిక్సులో వస్తారు. నీ కిది వరకు వీరివి తెలుసునా? ... మేడమ్ ...ఈమె మా మేనత్తకూతురు" అని మా యిద్దరికీ పరిచయాలు చేసింది. తాను

మా యిద్దరికీ ఎలా తెలుసునో వ్యక్త పరచేలా ఉన్న ఆ పరిచయాన్ని చూస్తే నాకు నవ్వొచ్చింది.


అంతలోనే నా కోసం ఇంట్లోనుండి కబురొస్తే 'తర్వాత మాట్లాడుకుందామని' వాసవితో చెప్పేసి లోపలికి వెళ్ళాను

అక్కడ కొబ్బరిపచ్చడికి చెక్కలు కోయటానికి సాయంచేస్తూ ఉండిపోవల్సి వచ్చింది.

నా బుర్ర జ్ఞాపకాలు కోరుతుంటే ఆలోచిస్తూ కొబ్బరి కోరుతున్నాను.

ఆ రోజు తెలుగు క్లాసు. గ్రామరు చెబుతున్నారు. అంతలోనే నాకు దగ్గరలో ఉన్న కిటికీకి అవతల ఏదో అలికిడివిని అనుకోకుండా అటు చూసాను ఎవరో అమ్మాయిలు అక్కడికి దగ్గర్లో నిలబడి మాట్లాడుతున్నారు. నా దృష్టి మళ్ళీ పాఠంమీదికి మళ్ళలేదు కారణం- కిటికీకి దగ్గర ఉన్న ఓ అమ్మాయి! వెలుగు కిరణాలు కిటికీలోంచి ఆమెమీద పడుతున్నాయి. ఆమె వెనకనే ఉన్న నాకు ఆమె చెవి మాత్రమే కనిపిస్తోంది. లేత ఎఱుపురంగులో ఉంది ఆ చెవి. కాంతిని ఆమె చెవి వడబోస్తున్నట్టుగా వుంది నాకు బ్యాటరీ లైటు దొరుకుతే అనుకోకుండా వెలిగించి దానిపై వేళ్ళు పెట్టి చూసుకుంటాను నాకు ఆ రంగు చాలా యిష్టం అచ్చం అలాగే కనిపిస్తోంది ఆమె చెవి ట్రాన్స్పరెంటుగా.

'ఓయ్ ... మేడమ్ నిన్నే చూస్తున్నారు' మోచేత్తో పొడిచింది ప్రక్క-



నున్న అన్నపూర్ణ.

చూపులను బలవంతంగా మళ్ళించుకొని పుస్తకంలోకి చూస్తున్నానే కాని మనసు మాత్రం పాఠంమీదికి మరల లేదు.

బెల్లు కొట్టగానే దానికోసమే ఎదురు చూస్తున్నట్లుగా పుస్తకం పడేసి 'పూర్ణా.... ఆ అమ్మాయి గురించి తెలుసా?' అన్నాను.

'ఏ అమ్మాయి ....' అంటూ నా వైపు తిరిగి నా చూపులు నిలచిన వైపు చూసి 'ఓ.... వాసవి గురించా నువ్వడిగింది. సరి.... ఇంతసేపూ పాఠం వినకుండా చూస్తున్నది ఆమెనేనా?....' అంటూ పుస్తకాలు పట్టుకొని లేవబోయింది. పూర్ణని చెయ్యి పట్టుకొని లాగి కూర్చోబెట్టి 'చెప్పూ .... ఇప్పుడు మనకి లీజరేగా .... ' అన్నాను.

'అంత కుతూహలం ఎందుకమ్మా.... పోనీ ఆ అమ్మాయిని పరిచయం చేస్తానుండు.... వాసవీ! మీకూ క్లాసులేదుగా రండి ఇక్కడ కూర్చుందాం' అంటూ ఆ అమ్మాయినే పిలిచేసింది. పూర్ణకి చొరవెక్కువ. క్లాసులో అన్ని గ్రూపుల వాళ్ళతోటీ కలిసిపోయి మాట్లాడేస్తుంది. నాకు నేనుగా ఎవరితోనూ పరిచయం చేసుకోలేను. కొంచెం మొగమాటంగా అనిపిస్తుంది. ఆ వాసవి గురించి అంత కుతూహలం అనిపిస్తుంది కానీ, తీరా ఎదురైతే ఏం మాట్లాడాలో తోచక మౌనంగా ఉండిపోయాను.

పూర్ణా, వాసవి ఏదో మాట్లాడుకొంటుంటే నేను వూరికే వింటున్నాను. వాసవిని కవులు వర్ణించేలా విశాల నేత్రాలు, సంపెంగముక్కు, దొండపండు పెదాలుకావుగాని కనుముక్కు తీరుగానే ఉంది. ఆ ఒంటి రంగువల్లనే ఆకర్షణీయంగా చెప్పుకోదగ్గ అందగత్తెలా అనిపిస్తుంది.

'ఏమిటోయ్ రజనీ .... మాట్లాడకుండా ముంగిలా వుండిపోయావ్?' అంది పూర్ణ.

'ఆవిడేదో ఆలోచనలో ఉన్నట్లున్నారు.' కొద్దిగా నవ్వుతూ అంది వాసవి.

అబ్బే ఆలోచనేంకాదు మిమ్మల్నే చూస్తున్నాను. మీరు బాగుంటారు.... ఫోటోజెనిక్‌గా ఉంటారు .... ప్రశంసనీయంగా చూస్తూ అప్రయత్నంగానే అనేశాను.

ఒక్కసారి స్టైలుగా కళ్ళెగరేసింది వాసవి. నాకెందుకో మనస్సు చివుక్కుమంది. ఎప్పుడూ ముఖస్తుతి చేసే అలవాటులేని దాన్ని ఈ రోజు ఇలా అనేశానేమిటా అనుకున్నాను

బహుశా ఆమెలోని సౌందర్యాతి

యంవల్లనేమో మా పరిచయం అంతకన్నా పెరగలేదు. మూడేళ్ళు గడచినా కూడా అంతంత మాత్రంగానే మా పరిచయం ఉండిపోయింది.

ఆ రోజు మా కాలేజీ దే ప్రిన్సిపాల్ రిపోర్టు చదువుతున్నారు. "ఆ స్తంభం ప్రక్క వరుసలో కళ్ళజోడు పెట్టుకుని బ్లూ షర్టు వేసుకున్నాడే అతనేనోయ్ వాసవిని చూడటానికి వచ్చాడట" అన్న మాటలు వెనుకనుండి వినిపించాయి. వాసవి ఫ్రెండు కాబోలు ఎవరితోనో చెబుతున్నట్లుంది. స్త్రీ సహజమైన కుతూహలం వల్ల ఆ సంభాషణ వినకుండా ఉండలేకపోయాను. నా దృష్టి స్తంభం ప్రక్క వరుసలోని అబ్బాయి వైపు తిరిగింది.

'ఏమి చేస్తున్నాడట అతను?'

"ఆ అబ్బాయి బి. కామ్. చదివాడు బేంకులో ఉద్యోగమట"

"అబ్బాయి బాగున్నాడు. ఇద్దరి జంటా బాగుంటుంది"

"కానీ అతను ఉత్తి గ్రాడ్యుయేటని వాసవి ఇష్టపడలేదట. అతనేమో కట్నం చాలదని ఒద్దన్నాడు. ఫెయిలయింది"

ఆదే చివరిసారి ఆమెను గురించి వినటం, చూడటంకూడా ఆ తర్వాత నేను చదువు ఆపుచేసాను. మరి కొద్ది రోజులకే పెళ్ళయిపోవడంతో నా రొటీన్ మారిపోయింది. ఆ తర్వాత సంవత్సరానికే పాప పుట్టడంతో పూర్తిగా సంసార జీవితంలో మునిగిపోయాను. నాన్నగారికి ట్రాన్స్ఫరై ఆ వూరు వదిలేయడంతో ఆ ఊరితో సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి నాకున్న ఒకరిద్దరు స్నేహితులుకూడా అప్పట్లో హాస్టలెట్సు కనుక వాళ్ళవల్ల కూడా మిగిలినవాళ్ళ వార్తలు తెలిసేవి కాదు. అయినా ఉత్తరాల్లో సంసార గొడవలే తప్ప కాలెజీముచ్చట్లు చెప్పుకునే తీరిక ఉండేదికాదు.

ఒక రోజు పాపవాళ్ళ నాన్నచేతిలోని బ్యాటరీ లైటు తనకిమ్మని అల్లరి పెడుతుంటే పాప చేతిమీద బ్యాటరీ లైటు వెలిగించి సమాధాయించుతున్నారు. అప్పుడు అకస్మాత్తుగా గుర్తు వచ్చింది. 'వాసవి యిప్పుడేం చేస్తుందో? పెళ్ళయిందో? ఉద్యోగం చేస్తుందో? ఆ వూర్లో తెలిసిన వాళ్ళెవ్వరూ లేరే ఆమె గురించి తెలుసుకోటానికి' అని ఆలోచిస్తుంటే మామయ్యకి ఆ వూరు ట్రాన్స్ఫరయిందని అమ్మరాసిన ఉత్తరం గుర్తు వచ్చింది. వాళ్ళింటికి ఎప్పుడైనా వెళ్తే తెలియాలి. సుచర్చలకి సంబంధాలు చూస్తున్నారటగా. పెళ్ళి అక్కడే అవుతుందేమో. తప్పకుండా వెళ్ళాలి. ఈ ఆలోచన అంతటితో ఆగిపోయింది.

మళ్ళీ సువర్చల పెళ్ళికార్డు వచ్చి వచ్చినపుడే ఇవన్నీ గుర్తు వచ్చాయి. ఈసారి మాత్రం పట్టుదలగా పెళ్ళికి వచ్చాను పెళ్ళికి సువర్చలమీద అభిమానంతో కాదు, కాలేజీ జీవితాన్ని గుర్తుచేసుకోవటానికీ, ఆ నాటి సహచరులను ముఖ్యంగా వాసవి గురించి తెలుసుకోవాలన్న కోరికే నన్ను మళ్ళీ ఆ వూరికి రప్పించింది.

ఇంత చేసి వచ్చాను కానీ, వచ్చిన దగ్గరనుండి పెళ్ళి పనులతోనే కాలం గడిచిపోతుంది. మొగమాటం కొద్దీ పనుల్లో చొరబడక తప్పటంలేదు. గబగబా కొబ్బరి కోరటం పూర్తిచేసి వెళ్ళేసరికి అప్పుడే వాసవి వెళ్ళిపోయినట్లుంది.

ఈవిడికి పెళ్ళయిన వాళ్ళంటే అదో విధమైన మంట కాబోలు. తను కూడా చేసుకోరాదూ, అంత కోరికఉంటే. నేను వెడ్డింగు కార్డు యిస్తే 'నీకే నేమిటి పెళ్ళి?' అని అదో రకం వ్యంగంగా అడిగింది భలే కోపం వచ్చిందనుకో. మేము తిరిగి వచ్చేస్తుంటే కెమిస్ట్రీ మేడమ్‌తో "ఏమిటో లైఫులు బోరుగా ఉందండీ" అని మెల్లగా అనడం వినిపించింది అంతకు ముందంతా అందంగా ఉన్నానన్న గర్వం కొద్దీ అందర్నీ కాదనేదట ఇప్పుడు ఈమె మీద చెడ్డభిప్రాయంతో సంబంధాలు తిరిగి పోతున్నాయట ...." ఇంకా చెప్పబోతూ నన్ను చూసి ఆగిపోయి తడుముకుంటున్నట్లుగా అయిపోయింది సువర్చల.

చాలా సేపటి నుండి సువర్చల మాటలు విన్నా ఇప్పుడు ఆమె తడబాటు చూసాక ఆ కథంతా వాసవి గురించేనని అర్థమైంది ఇంతవరకూ పొంగుతున్న ఉత్సాహం వాసవి వెళ్ళిపోవటంతో చప్పున చల్లారిపోయింది సెలవులేదని శ్రీవారు గొడవ పెట్టడంతో ఆ మర్నాడే మా వూరికి ప్రయాణం కట్టవలసి వచ్చింది. వాసవిని కలిసినా మాట్లాడలేకపోయాననె బాధ కలిగింది అంతేగాదు ఆమె గురించి విన్న విషయాలు మనసులో మరింత బాధ కలిగించాయి వాసవి నా స్నేహితురాలేం కాదు. ఎందుకో కొంతమందిని చూస్తే వారి పట్ల కుతూహలం కలుగుతుంది. అందుకు కారణం మాత్రం చెప్పలేం. అటువంటి కుతూహలమే నాకు వాసవి పట్ల ఉండి ఉంటుంది. తిరుగు ప్రయాణం ఏదో వెలితిగా అనిపించింది.

తర్వాత కొన్నాళ్ళ వరకు వాసవికి సంబంధించిన విషయాలేం తెలియలేదు. ఆ రోజు సువర్చల నుండి ఉత్తరం వచ్చింది. అందులో నన్ను ఆకర్షించిన

(మిగతా 76 వ పేజీలో)

పాపం రెండువందల రూపాయలకు అమ్ముడయే కూతురు తల్లి.

బలవంతంగా మార్చబడ్డ పతిత.

విముక్తి లభించని వ్యభిచారి.

విపరీత కోరికలు తీర్చే లైవ్‌షాక్ వేశ్య.

అంతేకాదు. అంతేకాదు. అంతేకాదు.

ఇప్పుడే పదిహేను సంవత్సరాలు నిండుతున్న పాప !

## నిర్మల ప్రత్యేకత

నిర్మల నిర్వహిస్తున్న శీర్షికలు విశిష్టంగా, చాలా ప్రత్యేకంగా అధునాతనంగా ఉంటున్నాయని పాఠకులు రాస్తున్న ఉత్తరాలు మాకు ఎంతో ప్రోత్సాహకరంగా ఉన్నాయి. నిర్మల యీ ప్రత్యేకతను నిలుపుకోవడానికి శాయశక్తులా ప్రయత్నిస్తుంది. పత్రికలు సృజనాత్మకంగా వుండాలనే సూత్రానికి నిర్మల ఎల్లప్పుడూ కట్టుబడి వుంటుంది. — ఎడిటర్

(40 వ పేజీ తరువాయి)

ముఖ్య విషయం ఒకటుంది – "వాసవి గారికి పెళ్ళయిందిట ఆ వూళ్ళోనే వెంకట్రావు అనే 'సోంబేరి' ఉన్నాడు–అతను వరుడు. అతను పి. యు. సి. వరకూ చదివి రోడ్డుపట్టుక తిరిగేవాడు. మూడు నాలుగేళ్ళ క్రితం వాళ్ళ నాన్న అతనిచేత వ్యాపారం పెట్టించారు. వాళ్ళ నాన్న జాగ్రత్తవల్ల వ్యాపారం ఓ దారిలో పడింది అప్పటినుండి పెద్దమనిషిలా వ్యవహరించుతున్నాడు. ఎమ్మెస్సీ చదివి లెక్చరరుగా పనిచేస్తున్న ఆమె, చదువు లేకపోతే పోయింది కనీసం సంస్కారమైనా లేని వాణ్ణి చేసుకోవటం పిటీ కదూ." అంటూ రాసింది సువర్చల

నా మనసులో వాసవి గురించిన ఊహా చిత్రాలకు మరో దెబ్బ తగిలింది.

మరో నాలుగు నెలలకి సువర్చల నుండి ఇంకో ఉత్తరం వచ్చింది

"పండుగకి అమ్మ దగ్గరికి వచ్చాను. మొన్న మా ఫ్రెండుకి డెలివరీ అయితే హాస్పటల్‌కి వెళ్ళాను. ఆ హాస్పటల్లో వాసవిగారిని కలిసాను కొడుకు పుట్టాడు. బాబు చాలా హెల్దీగా ఉన్నాడు పదకొండు పౌన్లు ఉన్నాడట. నేను వెళ్ళి చూసాను ఏదో నెలలోపిల్లాడిలా లేడు."

చదువుకొనే రోజుల్లో వాసవికి పెళ్ళి

సంబంధాలు వస్తున్నాయని తెలిసి ఆమె వైవాహిక జీవితం గురించి చాలా ఊహించాను. పెళ్ళికి నునుసిగ్గులు తొణుకుతుంటే లేత ఎఱుపులో మెరిసే ఆమె బుగ్గలు ముదురు రంగులోకి మారి యింకెన్ని అందాలు ఒలికించుతాయో ననుకునేదాన్ని. ముట్టుకుంటే మాసిపోతుందేమో అన్నట్లున్న ఆ ఒంటి రంగు నలిగిపోయి యింకెంత కందిపోతుందో అనిపించేది.

బాగారాసే రచయిత వ్రాసిన పుస్తకం మనసుపడి కొన్నప్పుడు యింతా చేసి ఆ పుస్తకం పరమ చెత్తగా ఉన్నప్పుడూ, బాగుందని కొన్న వస్తువు మంచిదికాదని ఎవరైనా అన్నప్పుడూ మనసెలా చిరాకుగా అయిపోతుందో అలా వుంది మనసు లోని ఊహా చిత్రం పూర్తిగా చెరిగిపోయింది. ఆమెమీదగానీ, ఆమె భర్త మీదగానీ జాలిపడే స్థితి దాటిపోయింది. ఎందుకంటే ఇలా ఆలోచించుతున్న నా మీద నాకే జాలేస్తుంది గనుక.


ఉత్తమ పత్రికలకు కేంద్రం

నవభారత్ న్యూస్ ఏజన్సీ

జిన్నాటవర్, గుంటూరు-1

ఏజంట్లు : నిర్మల. వసంతబాల, జనశక్తి

ప్రముఖ పత్రికలన్నీ దొరుకుతాయి